సూర్య రథం

(కవితా సంకలనం)

రాజు

కిన్నెర ఆర్ట్ థియేటర్స్

కిన్నెర పబ్లికేషన్స్
2-2-647/153, సెంట్రల్ ఎక్సైజ్ కాలని,
హైదరాబాదు-500 13.

Surya Radham by RAJU

సూర్యరథం—రాజు

ప్రథమ ముద్రణ : జనవరి 1983.

ప్రతులు: 1000

ప్రతులకు:—

(1) రాజు
5-7-37, సంగీత్‌నగర్,
హైదరాబాదు-500 872.

(2) కిన్నెర పబ్లికేషన్స్,
2-2-647/153, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ.
హైదరాబాదు - 500 013.

ముఖచిత్రం: బాపు

వెల. రూ॥ 5/-

ముద్రణ:
టి. వి. శ్యామలరావ్ & కో.,
ప్రింటర్స్ & పబ్లిషర్స్,
రాంనగర్, హైద్రాబాద్-44.

అంకితం

మైత్రికి

కిన్నెర మాట

"నెత్తురూ, కన్నీళ్ళూ తలిపి కొత్త టానిక్ తయారుచేశాడు శ్రీశ్రీ ఈ వృద్ధ ప్రపంచానికి" అన్నాడు చెలం.

నేటి యువతరంలో అలాంటి టానిక్‌లను గానీ, బలవర్ధక సాహిత్తి ఔషధాల్ని గానీ తయారుచేసే ప్రతిభావంతులకోసం కిన్నెర అన్వేషిస్తూ ఉంది.

ఈ 'సూర్యరథం' మా అన్వేషణ వ్యర్థం కావటంలేదని చెప్పటానికి నిలిచిన అక్షర శకటం.

రాజుగారు ప్రతిభావంతులు. భాష, భావం ఉదాత్తంగా సంగమించిన రస హృదయులు. తాము నిర్మించిన ఈ సూర్యరథాన్ని మా ద్వారా మీ వద్దకు నడిపించటం – కేవలం మా అదృష్టం!

కవి రాజుగారికి మా అభినందనలు, ధన్యవాదాలు! ప్రముఖ సినీ దర్శకులు శ్రీ దాసరి ఆవిష్కరించిన 'పల్లవి' తో మా కిన్నెర పబ్లికేషన్స్ మొదలయ్యింది. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్ని స్పృశిస్తూ, రసజ్ఞ లోకానందకరంగా నేటికి 14 పుస్తకాలు వెలువరించాం. ఈ 'సూర్యరథం' మా 15వ కానుక.

గుణ పక్షపాతం గల విజ్ఞులంతా మా ఈ కృషిని ఆదరిస్తారనీ, ప్రోత్సహిస్తారనీ, ఈ సూర్యరథాన్ని గ్రహించి కవిరాజుగారిని అభినందిస్తారని ప్రగాఢంగా నమ్ముతున్నాం.

మద్దాళి రఘురామ్
కార్యదర్శి,
కిన్నెర పబ్లికేషన్స్.

అభినందనలు

సూర్యరథంలో కవితలు చూచాను. నిజంగా చాలా బాగున్నాయి. కవిగారు చాలా మంచి ప్రయోగాలు చేశారు.

ఈనాడు వచ్చే యువకుల వచన కవితాసంపుటాలు చదవాలంటే నాకు భయం. చాలామందికి శబ్దంమీద అధికారం లేదు. ప్రయోగ కుశలత అంత కంటే లేదు. వచన కావ్యాల్లో కొన్నయితే బొత్తిగా చప్పగా ఉన్నాయి.

రాజుగారికి శబ్దంమీద అధికారం ఉంది. ఊహా నైశిత్యం ఉంది. నిజంగా మెచ్చుకుంటున్నాను.

అలాగే తానొక మంచికవి అయిఉండి, తోటి కవుల్ని, కవయిత్రుల్ని ప్రోత్సహిస్తున్న మా ఆచార్య తిరుమలను కూడా అభినందించకుండా ఉండలేక పోతున్నాను.

మంచిపనులు చేస్తున్న 'కిన్నెర'వారికి నా అభినందనలు!

ప్రొఫెసర్ తూమాటి దోణప్ప
నాగార్జున విశ్వవిద్యాలయం,
గుంటూరు.

ఆచార్య తిరుమల
తెలుగు శాఖాధిపతి
చైతన్య కళాశాల,
హైదరాబాదు - 1.

దివిటీ!

శ్రీశ్రీ మహాప్రస్థానం శీర్షికనుండి చివరివరకు ఎన్నిసార్లు చదివినా దాని హృదయం అతిసామాన్య పాఠకునికి ఎలాగైతే అర్థం కాదో అలాగే ఈ సూర్యరథం కూడా సాదావాడికి సీదాగా అర్థం కాదు.

అది గొప్పకాదు, ఆరోజులు పోయాయి. కానీ, అంత తేలిగ్గా అర్థమయ్యేదే కవితాత్మ అయితే రాళ్ళన్నీ దేవతావిగ్రహాలవ్వాలి; కూన రాగాలన్నీ సంగీత శాస్త్రాలవ్వాలి, పిచ్చిగీతలన్నీ 'బాపూ' బొమ్మలవ్వాలి.

అలా కాదు. ఉన్నమాట వేరు, అనుకునేమాట వేరు. మెరమెచ్చులకోసం అనే మాటలన్నీ నిజాలు కావు.

కొండెక్కి దేవుణ్ణి చూడటం వేరు, ఆ దేవుడి బొమ్మని పడగ్గదిలో కేలండర్ మీద చూడటం వేరు.

కవితానుభూతి కూడా యింతే!

అచ్చమైన ఆనందానుభూతిని అక్షరాల్లోకి దింపటానికి నిజమైన కవి ఎంత వేదన పడతాడో, ఆ కవి కన్న కవిత్వాన్ని దర్శించటానికి నిజమైన పాఠకుడూ అంత వేదనా పడాలి. అదే సరైన వియ్యం.

అందుకే, కవిత్వం కవిది మాత్రమే కాదు, సానుభూతిగల పాఠకుడిది కూడా. ఈ మాటని—"There is nothing like a poem absolute. Poetry is a function of sympathy between the author and his audience" - అని అంటాడు Kellet.

ఈ సంధానాన్ని మరో దృక్కోణంనుండి క్రీగంట చూస్తే ఒక చిక్కు కూడా కనిపిస్తుంది. ఇక్కడ పాఠకుడి సానుభూతినిబట్టి, గ్రహణశక్తిని బట్టి

స్థాయిని, బట్టి కవిని, కవిత్వాన్నీ అంచనావేయటం మొదలుపెడితే- అంచనాలు తారుమారు కావచ్చు. అంతేకాదు. ఏ కవినీ 'అకవి' అనీ, 'కుకవి' అనీ అంటా నికి వీల్లేదు. ఏ కవితనీ తీసి పారేయటానికి అంతకన్నా వీల్లేదు. ఎందుకంటే- ఎవరి అభిమానులు వారికి, దేని పాఠకులు దానికి తప్పక వుంటారు కాబట్టి.

అందుకే, Kellet ఏమనుకున్నా సరే - పాఠకుణ్ని బట్టి కవిని అంచనా వేయటం సబబుకాదు. కవి అనేవాడు పాఠకుడి సానుభూతిమీద ఆధారపడ కూడదు. కాదని తన అనుభూతే గొప్పదని కూడా అనుకోకూడదు. అది పరిణత ప్రజ్ఞావంతుని లక్షణం కాదు. నిర్వచనోత్తర రామాయణంలో తిక్కన:—

"ఎట్టి కవికైన తన కృతి యింపుఁబెంపఁ
జాలు, కావున కావ్యము సరసులైన
కవుల చెవులకు నెక్కినగాని నమ్మ
డెందుఁ బరిణతిగల్గు కవీశ్వరుండు"

ఓ బంగారంలాంటి మాట అన్నాడు. "బోద్ధారో మత్సర గ్రస్తాః", "ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే గదా!" వంటి ముళ్ళకంచెల్ని దాటి పరిణతిగల్గు కవీశ్వరుడు తన కావ్యాన్ని కేవల సామాన్య పాఠకుడికి కాకుండా సరస సహృదయ కవుల కెక్కించాలి. అలా మేధావుల తలూపించగలవారే గొప్ప కవులవుతారు. ఈ విషయాన్ని ప్రసిద్ధ ఆంగ్ల విమర్శకులు— Warren & welluk ఒప్పుకుంటూ "The great poets are judged by the frame of mind they induce" అని చెప్పారు.

కాబట్టి, కవి అనుభూతిని, కవితా విభూతిని అందుకోటానికి పాఠకుడు తప్పక ప్రయత్నించాలి. తన అభిరుచికి అనుకూలంగా లేనిది, తనకి అర్థంకానిది- 'బాగాలే'దని తీసిపారేస్తే - అప్పుడు కవే పాఠకుడిమీద సానుభూతి చూపెట్ట వలసి వస్తుంది. ఎందుకంటే—

కవిత్వం ఏమిటో, కావ్యంలో గుణం ఏమిటో, దోషం ఏమిటో తెలియని అజ్ఞాని, అవివేకి కాదు - కవి. ఒక విమర్శకుడు కవి కాలేడు కాని కవిలో

మాత్రం ఎప్పుడూ 'అంతరాత్మ' పేరుతో ఒక విమర్శకుడు గస్తీ తిరుగుతూనే వుంటాడు. వాణ్ని మెప్పించటమే కృత్యాద్యవస్థ; కవి పొందే వేదన: ప్రసవ వేదన. ఈ మాటని — Memories of My Life and Writings' - లో మహాశయుడు Gibbon - " The author himself is the best judge for his performance " అని ఆని-తూచీ అన్నాడు.

కాబట్టి, ఏదో ఒక చూపుడువేలికి గుచ్చుకోవలసిన అవసరం నిజానికి ఏ కవికీలేదు.

సంగీతానికి శ్రోత, నాటకానికి ప్రేక్షకుడులా కవిత్వానికి పఠిత ఉండి తీరాలి. ఎప్పటి వరకు? తను ఆ తాదాత్మ్య స్థితి నుండి బయటపడే వరకు. ఆ తర్వాత మిగిలేది అభిప్రాయమో, ఆకాంక్షో, అభినందనో కాదు, అసలు స్పృష్టే. లక్షమంది కాళిదాసుని చదవవచ్చు, కోటిమంది షేక్స్పియర్‌ని చదవవచ్చు. చదివిన ప్రతిఒక్కరి అభిప్రాయానికి అనుగుణంగా కాళిదాసూ మారడు, షేక్స్పియరూ మారడు. గ్రంథాలయాలు, దేవాలయాలు అంతే ! అంటే లోకవిమర్శ కంటే కవిగత ఆత్మవిమర్శ చాలా బలమైందని గుర్తించటం.

దీని సారాంశాన్ని Milton పండితుడు— " A good book is the precious life blood of a master spirit " అని విశ్వజనీనంగా చెప్పాడు.

అందుకే - ఈ ' master spirit ' ని అర్థం చేసుకోటానికి పాఠకుడు కేవలం పాఠకుడు కాకూడదు. సాధకుడు, శోధకుడు-కావాలి; రసజ్ఞుడు కావాలి.

రసజ్ఞుడు కానివాడికి కవిత్వం అర్థం కాదు.
కవిత్వం అర్థమైన వారంతా రసజ్ఞులూ కారు.

రసజ్ఞుడు ప్రధానంగా-గుణలేశాన్ని మెచ్చుకొనే సహృదయుడు కావాలి. దాని తర్వాతే శాస్త్రాలూ, పాండిత్యాలూను. ఆ ఉదాత్త మానసిక వ్యవస్థ గల వారిదే కవిత్వం ఎప్పటికీ తీసిపారేయలేని P. B. Shelley ఏమంటున్నాడో చూడండి :—

"Poetry is the reeord of the best and the happies monuments of the happiest and best minds." అంటాడు కాబట్టి 'best minds' కవిత్వానికి కావాలి. కాదంటే – శ్రీశ్రీలా 'కవిత కరక్కాయ సుమీ' అనుకోవాలి.

ఏ తపనా లేకుండా, ఏ పురిటి నొప్పులూ పడకుండా మానసపుత్రుల్ని కన్నట్టు, నోటికి వచ్చిన నాలుగు మాటలూ అడ్డదిడ్డంగా గీకేసి కవిత్వం అనుకోమంటే – మొహమాటంతో సంఘం ఒప్పుకోవచ్చుకానీ, కాలం ఒప్పుకోదు.

ఈ మాట చాలామంది అంటారు. అన్న ప్రతీవాడూ మహోత్తమ కవిత్వాన్ని సృష్టించలేడు. ప్రతిభ వేరు. వ్యుత్పత్తి వేరు. జాఫ వేరు, వైద్యం వేరు.

విలువలు చెడిపోకూడదన్న ఆశయం విమర్శకి ఊపిరి. దానికే యిన్ని దారులు !

అదే ఆదర్శం – కవిత్వానికీ ఉంది.

కవిత్వం – జాతి అంతశ్శక్తిని ప్రకటించే ఒక బలమైన సాధనం. కవిత్వం ఎంత శక్తిమంతంగా వుంటే ఆ జాతిచరిత్ర అంత వన్నెకెక్కుతూ వుంటుంది.

అందుకే–దుర్బల కవుల్ని ఆమద్ర లెక్కపెట్టకుండా —

" తరానికో వంద కవులు
తయారవుతా రెప్పుడూ
వందలోనూ మందలోనూ

మిగల గలిగే దొక్కడూ " — అని తేల్చి చెప్పాడు. ఆ ఒక్కడూ ఎవరో కాలమే చెప్తుంది.

ఆ కాలం సూర్యుని అధీనంలో వుంది.

ఆ కాలం కాంతిరథంగా ఉంది.

ఆ సూర్యరథాన్ని తోలుకొస్తున్నాడు-రాజు ! ఆ సూర్యుడితో వెలిగే రాజు-చంద్రుడు; ఈ సూర్య రథంతో వెలిగే రాజు-కవిరాజు. ఇతడు ఎండల్లో వెన్నెల !

2

రాజు నా ప్రియమిత్రుడు. అతని కవిత్వం, వ్యక్తిత్వం నాకు తెలుసు.

రాజు నలుపు-అతని హృదయం తెలుపు!

రాజు తల నలుపు-అతని తలపు తెలుపు!

రాజు ఇప్పటివరకు తెలుగు సాహిత్యవనానికి రాకుండా ఎక్కడో 'సంగీతనగర్' లో పంచమశ్రుతులు నవరించుకొంటూ కూర్చున్న కోకిల. ఇప్పుడిలా కాంతి వసంతాల్ని తరలించుకురావటానికి 'సూర్యరథం' మీద కవితాశాఖకి చేరిన కవికోకిల.

రాజకవి కాదు కవి'రాజు'. అలాగే—

పరభృతం కాదు స్వరభృతం. ఈ కవి-కవితా రవి. రవము గలవాడు రవి. అందుకే ప్రథమ ప్రయత్నంగా యీ 'సూర్యరథ' సారథ్యం!

ఇప్పటి వరకు సాగిన అజ్ఞాతవాసంలో రాజు ఏ శక్తి సాధించాడో - ఈ కాంతి గీతాల్ని అందిస్తున్నాడు. నిజమైన కవి తపస్సు అంతే. నిజానికి కవిది కోకిల జన్మ. అందుకే "వందే వాల్మీకి కోకిలం" అని ఆదికవికి అక్షరాంజలి ఘటించారు. ఆ స్థితిని " A Defence of Poetry " లో " A poet is a nightingale who sits in darkness and sings to cheer its own solitude with sweet sound " అని Sheller మహనీయుడు ప్రకటించాడు. అకవులు, కుకవులు కానివారికి యీ అజ్ఞాతవాసం తప్పదు.

మిత్రుడు రాజు తన కలం కదలికలో ఏర్పడ్డ ప్రతి కవితా పథంలోనూ ఓ కాంతిని నిక్షేపిస్తూ ఈ కవితా సంపుటిని సూర్య రథంగా మలుచుకున్నాడు, పిలుచుకున్నాడు.

గాంధీ పేరుతో బ్రాందీ షాపులా కాకుండా-ఈ అక్షరాల ఆలయంలో ఓ కవితా దీపం వుంది. అది రథమై సహృదయ తీరానికి సాగుతూ వుంది.

3

" అహం త్వా సర్వ పాపేభ్యో
మోక్ష యిష్యామి మా శుచః "

అంటూ ఢంకా బజాయించి క్షత్రియోచిత పరాక్రమ దక్షతతో శ్రీ కృష్ణుడు భగవద్గీతలో చెప్పుకున్నట్టు-ఈ సంకలనం లోని చాలా కవితల్లో కవిరాజు 'అహం' (నేను) నే ప్రదర్శించాడు.

గీత లోని విభూతియోగం లోని 'అహం' శబ్ద సూత్రాన్ని యీ సూక్త రథానికి కూడా కట్టుకోవాలి. లేకపోతే-కవి వహించిన యింత బాధ్యతా అహంకారమై పోతుంది. లేదా "భూమార్గం పట్టిస్తాను; భూకంపం పుట్టిస్తాను" వంటి ఒక నినాదమైపోతుంది.

అంటే-ప్రయోజనం వేరు జనం వేరు-దాని సిద్ధి వేరు. ప్రభుత్వ శాసనానికి లొంగనివాడు కవిత్వ శబ్దానికి లొంగటం దుస్సాధ్యం. పరమావధి వేరుగా ఉంది. అందుకే శ్రీశ్రీ కూడా మహాప్రస్థాన హృదయాన్ని 'ఖడ్గ సృష్టి' లో ప్రదర్శించాడు. మహాకవి గదా! మరోసారి దృష్టి సాగించాడు.

రాజు మహాకవి కాదు వట్టి కవి. అందుకే వేసిన ప్రతి అడుగు జాగ్రత్తగా వేయటానికే ప్రయత్నం చేశాడు.

సంకలనం ఆరంభంలోనే 'నేను' ఏమిటో 'ఆత్మాశ్రయ పద్ధతి' లో నిర్వచించాడు.

" నేను కార్మికుణ్ణి
పశ్చిమ దిక్కు పారబోసిన చీకటి గనుల్ని
తవ్వి పోస్తున్న శ్రామికుణ్ణి "—అన్నాడు.

ఇది యీ సంకలనంలోని అహానికి అంతస్సూత్రం; ఇక్కడ రవి స్థానంలో కవి ఉన్నాడు. అందుకే- 'అనల వేదిక' మీద నిలిచి—" నుదుటి మీది

"నుదుటిమీది కన్ను విప్పిచూస్తున్నా
గుండెల్లో గోరు ముంచి రాస్తున్నా"

అంటున్నాడు. అది మామూలు రాత కాదు నుదుటి రాత.

కాలానికి కాలాన్ని చుట్టి, భావంలో దీపం పెట్టి, ఆక్రమిస్తున్న ఇరులను తరిమికొట్టి, విక్రమిస్తున్న అరులను చెదరగొట్టి,- విశ్వకర్మగా, అపరబ్రహ్మగా- అంతశ్శక్తిని ఆవిష్కరించి-ఆర్తిగీతిని విశ్వజ్యోతిగా మార్చటానికి అగ్ని సరస్సులో పరిశుద్ధుడై రేపటి సూర్యునికోసం అర్ఘ్యం విడుస్తున్న తపస్వి-కవితా సిద్ధుడు- 'మిత్రుడు' 'రాజు'.

కవి రాజు 'హిమ కిరీటం' పెట్టుకుని, 'సాగర ఖడ్గం' పట్టుకుని, 'క్రాంతి కేతనం' ఎగరేస్తూ, 'కొన్నెత్తురు కోసం 'బీజాక్షరాలు' వెదజల్లుతూ - "కీకారణ్యంలో సైతం-నాతో నిర్భయంగా యిక నడు" అంటూ ప్రవోధిస్తూ - కదిలిపోతున్నాడు. ఒక కవితా రథంలా, ఒక ప్రభంజనంలా.

ఎవరు అతని వెంట నడవక పోయినా అతనికేం లోటు లేదు. అతని గమ్యం అతనిది. అతను అచ్చమైన కవి. పెదాల క్రింద వేదన అణచుకొని ఊపిరితిత్తుల ఉరస్లో ఆయువు దాచుకొని-ఆకాశం లోకి విసిరిన కలం వ్యోమ నౌక మీద విహరిస్తూ, భూగోళం మీద రాజకీయ రథ చక్రాల క్రింద నలిగిపోతున్న సామాన్యుల గుండె చషకాల్లో స్థైర్యాణ్ణి కరిగించి పంచుతున్న గని కార్మికుడు; కవితా ధార్మికుడు.

రాజు వ్యర్థావేశపరుడు కాడు. ధర్మరాజులా నవ్వుతో కోపాన్ని ప్రదర్శించగలడు. ఆలయాల్లో 'లయ'ని, ప్రణయంలో ప్రళయాన్ని, ప్ర'కృతి'లో కృతిని ప్రదర్శించగలడు. చాలా సునాయాసంగా

"నా రక్తం గంధం తీసి
తూర్పు మిత్రుని ముఖాన పూశాను
ఎర్రగా నవ్వేడు!" అనగలడు. ఈనవ్వులో ఎంత 'భయద సౌందర్యం' ఉందో, ఆ 'మిత్ర' శబ్దంలో ఎంత ధ్వని వుందో భావుకులు

ఊహించుకోవచ్చు. ఈ ఒక్క ప్రయోగం చాలేమో రాజుని 'కవిరాజు' అంటానికి.

4

"అగ్ని సరస్సున వికసించిన వజ్రం"—అన్న శ్రీశ్రీలా, "మట్టిలోన మల్లెమొగ్గ మాదిరిగా నడచిరా"—అన్న దాశరథిలా "పెను చీకటి సైగలతో నాకన్నుల రక్తముకల లాగి కొందురు" అన్న దేవులపల్లిలా-రాజు కొన్ని చోట్ల చాలా అందంగా కనిపించి ఏమీ అర్థం కాడు. "గుండెల్లో గోరు ముంచి వ్రాస్తున్నా" నంటూ గుండెల్లో తియ్యగా పొడుస్తాడు. "తెగిన తీగల స్వరాలు ఏరి, కొనవేళ్లకు చుట్టుకొని విశ్వవీణను మీటుతూ" కనిపిస్తానంటాడు. ఒక్కొక్కసారి — "ఈ వసుమతి నా శ్రీమతి" అంటూనే "సూర్యుని లేత కిరణాలు త్రుంచుతూ", 'ప్రకృతి ధేనువు నుండి సౌందర్య క్షీరం పిండుతూ'- "నక్షత్రాలు కడిగి పోసి పాల బువ్వ వండుతూ" కనిపిస్తాడు.

లతలో లావణ్యంలా, పువ్వులో అందంలా-ఒకానొక అనిర్వచనీయమైన అందం, కవిత్వంలో వుండే దాన్ని పట్టుకుని ఆనందించే ప్రయత్నం పాఠకుడు చెయ్యాలి. కవిత్వానికి అనిర్వచనీయ తత్త్వం కూడా ఒక ఉత్తమ గుణం చెబుతూవుంది. అందుకే దేవులపల్లి "ఏదియో అపూర్వ మధుర రక్తి స్ఫురియించు గాని, అర్థమ్ము కాని భావ గీతమ్ములవి..." అన్నారు. అలాగే-ఈ అనిర్వాచ్య తత్త్వాన్ని సమర్థిస్తూ- Henson అనే మేధావి - "I have little sympathy with this lust for intelligibility" అన్నాడు.

అద్దంలో పెట్టిన మిఠాయిలా కవిత్వంలో అనిర్వచనీయతని గుర్తించి తృప్తిపడవచ్చు. కానీ, సాంకేతిక కవిత్వం-తల పగలగొట్టుకున్నా అర్థంకాదు. కవిలో పాఠకుడు పరకాయ ప్రవేశం చేస్తేనే గానీ అర్థంకాదు.

ఉద్యోగ పర్వంలో తిక్కన :—
ఒకటిఁగాని రెంటి నిశ్చల యుక్తిఁజేర్చి
మూఁటి నాల్గింటిఁగడు వశ్యములుగఁ జేసి

యేనిటిని గెల్చి యాటింటి నెఱిఁగి యేడు
విడిచి వర్తించువాఁడు వివేక ధనుఁడు !!

అన్నాడు. ఈ పద్యానికో భాష్యం రాయాలి. ఒక్క మాటలో చెప్పాలంటే-గీతాసారాన్ని యిలా తేటగీతి లో బిగించేశాడు, తిక్కన. అందుకే తిక్కన కవిబ్రహ్మ. తిక్కనలా ఉద్యోగించలేదు కానీ- 'నిగ్రహం' తో-రాజు-ఇలా అంటున్నాడు:-

"సృష్టికర్త ప్రయోగశాలలో
సంభవించిన ప్రమాదంలో
అస్తవ్యస్తంగా కలసిన
రసాయనాల సమ్మేళనం మానవుడు -
అందుకే ఇన్ని 'అ' కారాలు
అందుకే ఇన్ని 'క్షా' కారాలు".

ఈ అకారాలు, క్షాకారాలు-కవి సంకేతాలు. రసాయన ప్రయోగశాల కాబట్టి-'అ' కారాలంటే-ఆమ్లాలనీ, 'క్షా' కారాలంటే-క్షారాలనీ అర్థం అవుతుంది. అంత మాత్రంతో ఆగిపోతే క్షారామ్ల మానవుణ్ని సృష్టికర్తతో ముడిపెట్టవలసిన పనీలేదు; కవిత్వమూ లేదు.

'భవం' - 'భావం' మీద ఆధారపడివుంది కాబట్టి-ఆకారాలంటే-ఆమ్లాలే కాకుండా, మానవునిలోని ఆవేదన, ఆశ, ఆశయం, ఆరాటం, ఆర్తి, ఆలాపన, ఆనందం, ఆవేశం, ఆలోచన వంటి అనేకానేక మనః ప్రవృత్తులై వుండాలి. అలాగే 'క్షా' కారాలంటే క్షారాలే కాకుండా-క్షాత్రం, క్షమ, క్షతజం, క్షపణం, క్షాంతి, క్షేమం, క్షోభ, - వంటి గుణస్థితులై వుండాలి. అలాకాకపోతే-ఇంత సాంకేతిక పద్ధతి వ్యర్థమైపోతుంది. ఇది నా అంచనా మాత్రమే. కవిహృదయం ఏమిటో నాకు తెలియదు. నిజానికి, నాకు చాలా తెలియవు.

5

"చీకటి దుప్పటి కప్పుకుని
సురక పెట్టే లోకం కనులు విప్పేవాడు రవి!

జడత్వే ఆవరించిన జనం మనసు పొరలను
విదిలించి చైతన్యం నింపేవాడు కవి!!

అన్న డా॥ సి. నారాయణరెడ్డి నిర్వచనానికి మిత్రుడు రాజు ఒక చక్కని ఉదాహరణని అనుకుంటూ.

ఈ 'సూర్యరథం' చదివి — ''Poetry of the highest kind may exist without metre'' అన్న Coleridge ని గుర్తుచేసుకుంటూ చివరిగా చిన్ని మనవి చేసుకుంటున్నాను,

శ్రీశ్రీ కవిత్వాన్ని తూచే రాళ్ళు తన దగ్గర లేవన్నాడు చెలం; చాలా నిజాయితీగా. కానీ మహాప్రస్థానానికి లభించిన యోగ్యతాపత్రం లాంటి పత్రం మరే తెలుగు కావ్యానికీ లభించలేదనటం అతిశయోక్తి కాదు. గొప్ప గొప్ప విషయాలన్నీ అలాగే రివర్స్ గేర్‌లో ఉంటాయి.

అయితే-నేను చెలాన్ని కాను. ఒక సామాన్య పాఠకుణ్ని. మనసులో ఏ మడీ కట్టుకోని ఒక శ్రోతని. కవిత్వానికి కరిగిపోయే హృదయం, సంతోషంతో చెమ్మగిల్లే కళ్ళు తప్ప మరే సంపదా లేనివాణ్ని.

నా హృదయమే నాకో తూనికరాయి. దాంతోనే తూస్తాను. తూచలేని వాటిని భద్రంగా దాస్తాను.

మిత్రుడు రాజు రాసిన కవితలు విని, సంకలనంగా వెలువరించమని ప్రోత్సహించాను; పోరు పెట్టాను. రాజుని రచ్చకీడ్చాను. "నన్ను-నా కవిత్వాన్ని తెలిసిన వారు-మీరే ముందుమాట రాయండి-" అని రాజు అడిగాడు. సరే నన్నాను.

నిజానికి ఇది-ముందుమాటా కాదు, సూర్యరథానికి పీఠికా పథమూ కాదు. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. స్నేహధర్మంతో రాశాను. అంతే.

రాజుని మీరూ చదవండి. ఆలోచించండి ! 'ఓహో' అనుకుంటే అభినందించండి, 'ఆహా' అనుకుంటే ఆదరించండి. ఏమీ అనుకోలేకపోతే ఓ చిరునవ్వుతో రాజునీ, మీ దగ్గర యింత టైం తీసుకున్న నన్నూ మన్నించండి !

—ఆచార్య తిరుమల

నన్నూ, నా కవిత్వాన్ని ప్రోత్సహిస్తూ వచ్చిన శ్రీ ఎల్లోరా, శ్రీ పాలకోడేటి వంటి సాహితీమిత్రులకి- పత్రికాధిపతులకి—

కోరిన వెంటనే ముఖచిత్రం పంపిన కొండంత మనీషి బాపుగారికి-అభినందన రూపంలో ఆశీస్సులందించిన ఆచార్య తూమాటి దోణప్పగారికి—

అడుగడుగునా నా భుజంతట్టి ముందుకు నెట్టుతూ, ఈ సూర్యరథ గమనానికి గేటుతెరిచిన 'కవికౌస్తుభ' ఆచార్య తిరుమలగారికి—

ఈ సంపుటిని 'సూర్యరథం' అన్న శ్రీ సుభాకి—ఆర్థిక సహాయం చేసిన సంగీతనగర్ సాహితీప్రియులందరికీ—

నా యీ తొలి ప్రయత్నాన్ని గుర్తించి, మెప్పుకోలుతో మీకు అందిస్తున్న ప్రముఖ సంస్థ కిన్నెర పబ్లికేషన్స్‌కి—

నా కృతజ్ఞతలు !

—రాజు

రచన

1. రుధిర యాగం— (7-2-75)—ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
2. అనల వేదిక— (19-8-78)—జ్యోతి మాస పత్రిక
3. అగ్నివీణ — (15-2-81)
4. సృజన — (31-10-76)—జ్యోతి మాసపత్రిక
5. అనివార్యం — (12-5-81)
6. నిగ్రహం— (12-7-81)—ఆంధ్రప్రభ దినపత్రిక
7. ఉదీచి — (21-3-77)
8. విరాటార్జునీయం— (21-9-76)—ఆంధ్రప్రభ వారపత్రిక
9. జ్యోతిర్లత— (21-6-81)—ఆంధ్రప్రభ దినపత్రిక
10. దీప ధనుస్సు— (12-9-82)
11. విశ్వ కవిత్వం— (11-10-81)
12. సిద్ధి — (9-1-82)—జ్యోతి మాసపత్రిక
3. పూల డాలు — (14-2-82)
14. కన్నీటి పువ్వు— (13-12-82)
15. వసంతోదయం— (26-3-82)
16. హిమకిరీటి— (13-9-81)
17. భాస్వరం — (21-2-79)—ఆంధ్రప్రభ వారపత్రిక
18. సమీక్ష — (23-7-81)
19. అస్త్రగీతం — (8-1-81)
20. సాగరఖడ్గం— (16-8-81)
21. క్రాంతి కేతనం— (15-3-81)—ఆంధ్రప్రభ వారపత్రిక
22. బీజాక్షరాలు — (12-4-81)—జ్యోతి మాసపత్రిక
23. క్రొన్నెత్తురు — (20-12-81)—ఆంధ్రప్రభ వారపత్రిక

రుధిరయాగం

నేను కార్మికుణ్ణి
పశ్చిమ దిక్కున పారబోసిన చీకటి గనుల్ని
తవ్వి పోస్తున్న శ్రామికుణ్ణి
దారిద్ర్యపు కనుమలలో నినదిస్తున్న
రుద్రవీణా నాదాన్ని, అంతఃపురాల వైపు మళ్ళిస్తున్నాను.
తరుగులేని, తిరుగులేని రేపటి ఓజస్సుకై
నీటి దీపాలలో వెలుగుతుంటాను
కన్నీటి రూపాలలో కదులు తుంటాను.

నేను శోధకుణ్ణి
•అంతరంగాల పొరల్లోంచి
విషపు తెరల్ని వేరు చేస్తున్న సాధకుణ్ణి
రాజకీయ రథచక్రాల క్రింద నలిగిపోతున్న
సామాన్యుల నెత్తుటితో గోపురాలు నిర్మిస్తున్నాను.
ఎదురులేని, బెదురులేని
సమతా సమరానికై
చందమామను చిదిమి
మనసు మనసుల పంచ పుంచుతున్నాను
సూర్యుణ్ణి కరిగించి
గుండె చషకాలలలో పంచుతున్నాను.

అనల వేదిక

నలుగురిలో ఉన్నప్పుడు
ఒంటరిగా కనిపిస్తావ్
ఒంటరిగా నిను చూస్తే
నలుగురివి అనిపిస్తావ్
నవతేజా! కవిరాజా!
ఎటో ఎటో చూస్తున్నావ్!
ఏమిటేమిటది వ్రాస్తున్నావ్!

అధికారం విస్తరిలో అన్యాయం భోంచేసే
బాబుల కథ, జేబుల కథ
కాపుంచిన కంచెలచే
మానాలు మేసేయబడ్డ
కొమ్మల కథ, రెమ్మల కథ
నుదుటి మీది కన్ను విప్పి చూస్తున్నా
గుండెల్లో గోడు ముంచి వ్రాస్తున్నా.

అగ్నివీణ

నా రక్తం గంధం తీసి
తూర్పు మిత్రుని ముఖాన పూశాను.
ఎర్రగా నవ్వేడు !
ఆ నవ్వు జ్వాలలై
నలుదిక్కుల వ్యాపిస్తోంది
విర్రవీగుతున్న చీకటి,
విభ్రాంతి చెందింది.

విస్తరిస్తోన్న అగ్ని వెదజల్లే
వేద సారాన్ని నా కలం నిండా నింపుకొన్నాను.
విశ్వాంతరాళాల్లో ప్రతిధ్వనించేలా
అంతరాంతరాల్లో వెలుగు చిమ్మేలా
కలానికి కాలాన్ని చుట్టి
కలకాలం పలికిస్తాను
భావంతో దీపం పెట్టి
భవిష్యత్తును వెలిగిస్తాను.

సృజన

ఇవ్వేళ నన్నెవ్వరూ ఆపలేదు
నా విలయ నర్తనా న్నెవ్వరూ ఓపలేదు
స్వచ్ఛమైన మంచునీటితో అభ్యంగన స్నానం చేసి
ఆకుపచ్చని జరీపట్టు చీర ధరించి
పుష్పాళ్ళను 'పౌడరు' గా అద్దుకొని
బాలసూర్యుణ్ణి తిలకంగా దిద్దుకొని
వేదాల పెదాల పై చిరునవ్వులు చిందిస్తూ
అర్ధనిమీలిత నేత్రాలతో కరుణ రసాన్ని అందిస్తూ

తల్లిదండ్రుల్ని ఒప్పించి
సపర్యలతో నన్ను మెప్పించి
నా పాణిని గ్రహించిన -
ఈ వసుమతి నా శ్రీమతి
తన పుట్టింటి నట్టింట్లో

ఈమెను అవమానాలకు ఆహుతి చేస్తున్న
అవినీతి దక్షుల దోపిడి యజ్ఞాన్ని
వీరభద్రుణ్ణై విచ్ఛిన్నం చేస్తున్నాను
ఈవేళ నేను ముక్కంటిని.

ఇవ్వేళ నన్నెవ్వరూ ఓపలేదు
నామహోత్కృష్ట మహోజ్వల సృష్టి నెవ్వరు ఆపలేదు
మెదడుగా సూర్యుణ్ణి పొదిగి

గుండెగా చంద్రుణ్ణి అతికి
ఉక్కును శరీరంగా కూర్చి
చైతన్యాన్ని నరాలుగా పేర్చి
నిజాయితీని నెత్తురుగా మార్చి

వసంత రాగాలలో నారాణి వాయించు
కచ్ఛపీ మృదుల నాదాలతో ఆయువు పోసి
సృజియిస్తున్నాను -
గాండీవి సాచి విసిరే వాడి ఇషువుల్ని
రేపటి తరాన్ని పరిరక్షించే వీరశిశువుల్ని
ఈవేళ నేను పరమేష్ఠిని.

ఇవ్వేళ నన్నెవ్వరూ ఆపలేరు
నా పరిపాలనా దక్షత నెవ్వరూ వ్రేలెత్తి చూపలేరు.
ఉచ్చులు పన్ని చిచ్చులు పెట్టే
సాలెపురుగు తుచ్ఛపు పన్నాగాలు
శ్రమదానాలతో చీమలు కట్టుకొన్న ఇళ్లను
దౌర్జన్యంతో ఆక్రమించుకొనే పెను పన్నగాలు

కాకుల గూళ్లలో గ్రుడ్లను పొదగ బెట్టి
కూని రాగాలతో కాలం గడిపే కోయిళ్ల సోమరితనాలు
ఐశ్వర్యాన్ని మేరు నగాలుగా మేటలు వేసే
పొలాలను బంజర్లుగా వదలి
బాధ్యతా రహితంగా పరుగులు తీసే నిమ్నగలు -
లేని.........
నవసమాజ బృందావనాన్ని
సామ్యవాద గోవర్ధనగిరి నీడ క్రింద-
చల్లగా పాలిస్తున్నాను
ఈవేళ నేను విష్వక్సేనుణ్ణి.

అనివార్యం

... ...
... ...
... ...
... ...

తూర్పుకీ వుంది మార్పు
గాడ్పుకీ వుంది మార్పు
ఈ రేయి నల్లబడ్డ తూర్పు
రేపు మందారమై పూస్తుంది.
ఈ సాయం సంధ్యలో
చల్లబడ్డ గాడ్పు
రేపు ప్రభంజనమై వీస్తుంది.

విగ్రహం

సృష్టికర్త ప్రయోగశాలలో
సంభవించిన ప్రమాదంలో
అస్తవ్యస్తంగా కలిసిన రసాయనాల సమ్మేళనం మానవుడు.
అందుకే ఇన్ని 'అ'హంకారాలు
అందుకే ఇన్ని 'షా'కారాలు
ఈ వికారాలకు దూరంగా—
రెక్కలు అతికి ఆకాశంలో విసరిన
నా కలం వ్యోమనౌకమీద విహరిస్తున్నాను విలాసంగా

తాడుచుట్టి నేను త్రిప్పివదలిన
భూగోళం బొంగరంమీద
మహాకావ్యాల మాల పట్టుకొని
విశ్వభారతి నన్ను ఆహ్వానిస్తోంది.
అక్షరాలు పొదిగి మిత్రులు
నాకోసం నిర్మించిన పీఠంమీద
నా వామాంకాన్ని అలంకరించాలని.

పాపం ఆమెకు తెలియదు
నేను జితేంద్రియుడనై
చుక్కగా మారి శూన్యంలో పరిభ్రమిస్తూ.
పాలపుంతకు కాంతులు పెంచుతున్నానని
మూలికల నాలుకలకు రుచులు పంచుతున్నానని.

ఉదీచి

అడ్డదారులు ఆక్రమించుకొనే
ఆరాటంలో
సూర్యుడు పశ్చిమాన ఉదయిస్తే
ప్రకృతి సహించదు!

నాట్య కౌశలాన్ని ప్రదర్శిస్తున్న
ఆనందంలో
కాళిక కన్నవారినే కాలరాస్తే
కాలం సహించదు!

విరాటార్జునీయం

శతాబ్దాల బానిసతనంలో పెంచుకున్నవి
భాషా విభేదాలు
మతాతత్త్వాలు
మూకుమ్మడి హత్యలు
దొంగ వ్యాపారాలు-దారి దోపిడీలు
మానహరణాలు -

దొరలు విసిరేసిన
సిగరెట్ పీకె ఇంతదాకా రగులుతూనేవుంది
ఊపిరితిత్తులు తూట్లు చేస్తూ
గొట్రు గది నిండా బుగలు తూనే వుంది.

ఈ ఉనికిని నిర్జించని వాళ్ళు
ఈ మనికిని వర్జించని వాళ్ళ
ఇలాగే కొనసాగితే కొన్నాళ్ళ
చిక్కదు మనశ్శాంతి
ఎక్కడిది మనకు క్రాంతి?

ఆక్రమిస్తున్న ఇరులను తరిమికొట్టాలని
విక్రమిస్తూన్న అరులను చెదరగొట్టాలని
గాంధారీత్వానికి గంతలు విప్పుతున్నాను
అర్జునుణ్ణి రాజీనామా చేయించి
గాండీవం చేతికిస్తున్నాను.

జ్యోతిర్లత

భావాల పందిరి మీద
భాషా లతను పాకిస్తున్నాను:
రాలిన పువ్వుల పరిమళాలు పిండి
వసంతాల మీద చల్లుతూ,
తెగిన తీగల స్వరాలు ఏరి
కొనవేళ్లకు చుట్టుకొని విశ్వవీణను మీటుతూ.

పుటల్లో పూసే పద్యాల రథ్యలో నా గానం
ఆమనిలో కూసే పికాల గొంతులో నా యానం

నేను -
నవ్య భావాల వేదికనై
మరో మహాప్రస్థానానికి పీఠికనై
విశ్వకవితా రూపంలో పిలుస్తాను
అఖండ కళాజ్యోతికి వెలుగై నిలుస్తాను.

దీప ధనుస్సు

కునుకుతోంది దీపం
కొడిని రాల్చి ఎగదొయ్ వత్తి!

మలిగి పోతోంది దీపం
చమురు పోసి రగిలించు కాంతి!

కొంపలు తగల బెడుతోంది
కుటిల రాక్షస రూపం
అంతంచెయ్ దాని ప్రతాపం.

ఇదిగో దీపం!
ఇది దావాగ్ని చాపం!

విశ్వకవిత్వం

త్రివర్ణ ముఖచిత్రం అట్టక్రింద కుట్టిన
బహుశార్థ కావ్యాన్ని ఇంక చదవలేను
అయిదాశ్వాసాల ఈ ప్రబంధం లోని
విషాద రసాన్ని ఆస్వాదించలేను

విచ్చుకత్తుల విన్యాసాల విద్రోహ ఘట్టాల నుంచి
మూకజీవుల భయంకర ఆర్తనాదాల నుంచి
పారిన నెత్తుటి ధారలతో
కారిన కన్నీటి చారలతో
బరువెక్కిన పుటల మధ్య నలిగిపోతూ
విస్తువై, విహస్తువై చూస్తున్న
నా పాత్రను వేరు వేరు చేస్తున్నాను.

వైరి సమాసాలు లేని
శ్లేషార్థాలు లేని
దుష్ట సంధులు లేని
పద్యకమలాలు పూయించడానికి
బృహత్కావ్యాన్ని వ్రాయించడానికి
సూర్యుని లేత కిరణాన్ని త్రుంచి
నా పాత్ర చేతి కిస్తున్నాను
ఇప్పుడు నేను క్రొత్త కత్తులు చేస్తున్నాను—
విశ్వకర్మని
ఇప్పుడు నేను క్రొత్త నెత్తురు పోస్తున్నాను—
అపర బ్రహ్మని.

సిద్ధి

వెకిలి చేష్టల అప్సరసల వీధిలో
వజ్ర నిర్మితమైన గదిలో, నామదిలో, ధ్యాన సమాధిలో
నావెన్నులోంచి ప్రవహించింది ఆర్తిగీతి
నాభ్రుకుటి మీద తట్టి లేపింది విశ్వజ్యోతి.

నేను —
సిద్ధుడనై
అగ్నిసరస్సులో పరిశుద్ధుడనై
రేపటి సూర్యుని కోసం అర్ఘ్యం విడుస్తున్న తరుణంలో;

గ్రహణ దష్ట సుధాంశు నేత్రాలనుండి
నా దోసిట్లో రాలాయి తెల్లకలువలు
నాక వనం నుండి ఎగిరి వచ్చి
నా నగ్నహృదయాన్ని చుట్టుకొన్నాయి
మందార రేకుల వలువలు.

పూల డాలు!

కృంగి పోతున్న సూర్యుణ్ణి చూసి బెంగపడకు
పొంగి వస్తున్న చీకటిని చూసి ఖంగారు పడకు

అస్తమిస్తూ కూడ హాయిగా నవ్వే
అతని ఆదర్శపు అరుణిమతో
నీ మనోదీపాన్ని వెలిగించుకో

అప్పుడు అనిపిస్తుంది.
సూర్యుడు అస్తమిస్తున్నది అబద్ధమని
ఆవలిదిక్కున విస్తరిస్తున్నది నిబద్ధమని

అప్పుడు అనిపిస్తుంది-
అతని ధైర్యం ఈ దిక్కున నువ్వుంటావని
చీకటిని చీల్చుతావని, రేయంతా నిలుస్తావని.

అప్పుడు అనిపిస్తుంది-
రేపటిదాకా నువ్వీ జగతికి అధిపతి వని
ముష్కరుల పాలిట పశుపతి వని.

నాకెప్పుడో తెలుసు
నువ్వు అతిరథుడవని
నాకెప్పుడూ తెలుసు
నువ్వు మహారథుడవని

అందుకే !

ఇదే నీకోసం నా కావ్యం

ఇది, వాడి కటారు

అందుకో !

నీ విజయానికి నా ఆశీస్సు

ఇదే, పూల డాలు.

కన్నీటి పువ్వు!

వేయి జన్మల అనుభవాల రేకులతో ఆహ్వానిస్తున్నాను
కన్నీటి కోనేట పుట్టిన పద్మాన్ని నేను.

కొన్ని కాంతి దూరాల కవతల
యుగాల శిధిలాల దొరికిన
ఖలేజాల శిలాజాలను,

ఋతువుల క్రతువుల హవిస్సుతో
రంగరించి తీసిన మధువును
నా రేకుల కుదుళ్లలో కూర్చివుంచాను

నీ మెత్తని తొండాలతో తీయగా జుర్రుకో
ఆ కొమ్మను వ్రేలాడుతున్న మైనపు గుండెల్లో దాచుకో

మత్తెక్కి, మైమరచి మిడుకుతూంటే మన్నించలేని
మొండి హృదయం నాది.
గుండెల గుండెల్ని పిండుతూంటే తట్టుకోలేని
లేత హృదయం నాది.

నీ తొండాన్ని దండంగా ఎత్తినప్పుడే
నీజాతికి నిశాంతి
నీ ఊర్పును సుడిగుండంగా ఒత్తినప్పుడే
నా మనసుకు ప్రశాంతి

వేయి జన్మల అనుభవాల రేకులతో ఆహ్వానిస్తున్నాను
కన్నీటి కోనేట పుట్టిన పద్మాన్ని నేను.

వసంతోదయం

కత్తి గంటు మీద
కోన కంటి మీద
సైరంధ్రి ఒంటి మీద
పొంగిన అగ్నిసాగర తరంగాలు
ఉరికి ఉరికి వస్తున్నాయి!

ఎదురేగి నా పద్యాలు
స్వాగత గీతాలు పాడుతున్నాయి.

రెక్కలు విదుల్చుకొని పక్షులు
వేణువు లూదుతూ భూపాళాన్ని ఆలపిస్తున్నాయి.

కళ్లతో కళ్లాపి చల్లి
చుక్కలు తలుపులు మూసుకొంటున్నాయి.

రంగుల దుకూలాలు చుట్టుకొని
పూలు పువ్వొళ్లతో ముగ్గులు పెడుతున్నాయి.

రాగ రంజితమై
దిక్కులు కుంకుమాక్షతలు చల్లుతున్నాయి.

పాలిపోయిన మేఘాలు
'నల్ల'దనాన్ని పుంజుకొని దుందుభులు మ్రోగిస్తున్నాయి.

ఈ కోలాహలంతో
రెచ్చి వచ్చిన వసంతంలో నన్ను చూడు!
కీకారణ్యంలో సైతం-నాతో
నిర్భయంగా యిక నడు!!

హిమ కిరీటి

ప్రకృతి ధేనువు నుంచి
సౌందర్యక్షీరం పిండుతున్నాను;

నక్షత్రాలు కడిగి పోసి
పాలబువ్వ వండుతున్నాను
వెండి గిన్నెలో వంచుతున్నాను
చల్లార్చి అందరికి పంచుతున్నాను

అయినా నావాళ్లు ద్వేషిస్తున్నారు
దుర్భాషలతో దూషిస్తున్నారు.

వాళ్లు నా ఆదర్శం గుర్తించలేని అంధులు
నా ఆవేశాన్ని ఆవాహన చేసుకోలేని మందులు

నీడను చూసి భయపడే పందలు
చెప్పి చెప్పి అలసి పోయాను.

మబ్బులు పరచిన మంచం మీద
వెన్నెలతో విసుదుకొని సేద తీర్చుకొంటాను

నిద్రలో నేను కన్న కలలు
కరడు కట్టి రేపటి సూర్యరథం మీద
కాగడాగా వెలుగుతుంది.
మెత్తని కిరణాలతో నన్ను తట్టి లేపుతుంది.

నాకు నమస్కరించి సూర్యుడు
నాకావ్యం గానం చేసుకొంటు సాగిపోతాడు.

జగత్తు పరవశించి నాకు జేజేలు కొడుతుంది
వినువీధులలో రంగుల తోరణాలు కడుతుంది

చంద్రుణ్ణి కిరీటంగా పెట్టి,
వసంతాన్ని తురాయిగా చుడుతుంది.

భాస్వరం!

దేశమా
నీకు పేదలంటే ద్వేషమా?
దేశమా
నీకు ధనికులంటే సంతోషమా?
దేశమా
ఉన్నదంటే దోషమా?
దేశమా
'రామరాజ్యం' వల్లెవేస్తూ
నెత్తుటేరుల స్నానమా
దేశమా
రాజ్యమేలే రౌడీలకు
ప్రజల ప్రాణం ప్లానమా
దేశమా
పాతివ్రత్యం కథలు చెపుతూ
పడతి మానం దానమా

దేశమా
కష్టజీవుల కడుపు కొడుతూ
సామ్యవాదం గానమా

అంటూ...వినిపిస్తోంది పాట

అదాటున లేచి
రాత్రి నరసాల సందడిలో

నలిగిన మనసును సరిచేసి
ప్రణయపు గుర్తులు కనిపించకుండ
ఒంటి నిండా కప్పుకొని
తలుపు తీసి చూశాను

మా పెరట్లో
తుమ్మచెట్టు కొమ్మల్లోంచి
కాకి గూడు పక్కన పొంచి
పాడుతోంది కోకిల
కొందరి గుండెల్లో కన్నీరు కారగా
కొందరి మనసులు యింపారగా.

లేత ఆకులు మేసి
కంఠాన్ని పంచమ స్వరానికి మేళవింపచేసి
వసంతానికి స్వాగతం పలికే కోకిల
గుడ్లుపెట్టి పొదగలేని షోకిల!

సమీక్ష

మడుసు గోడ మీద కాకి కూస్తే
సంబరపడ్డనాటికీ
మడుసు గోడ మీద కాకి అరిస్తే
ఉలిక్కిపడ్డనేటికీ
ఎంత తేడా!

అస్త్రగీతం

ఇదో యిదో గోళం
ఇది గందర గోళం
మబ్బుల మడతల్లో
నేను మరచి వచ్చిన నా స్వప్నాలతో
కడిగేసుకో కల్మషం!

ఇదో రకం ద్యూతం
అమ్మో! ఇది పెను భూతం

నేను ఉపదేశించిన అక్షర శస్త్రాస్త్రాలతో
అంతంచెయ్ దీని జీవితం

ఇదే, యిదే, గీతం
ఇది విప్లవ సంకేతం
ఎలుగెత్తి పాడుకో కొత్త బాణీ కట్టి
వినూత్న సంగీతం.

సాగర ఖడ్గం!

నీ స్వర్గం ధ్వాంత నిలయం నేడు
నా చుట్టూ జ్వలిస్తోంది కాంతివలయం చూడు.
రాక్షస క్రీడతో నువ్వు నా గర్భంలో
ఎన్ని అణుప్రయోగాలు చేస్తున్నా
అలల పెదాలక్రింద వేదన అణచుకొని
నవ్వుతూనే ఉన్నాను.

కర్కశంగా, కొరివితో నువ్వు నా కండలమీద
ఎన్ని వాతలు పెడుతున్నా
గుండె లోతుల్లో బాధను పాతిపెట్టి
శ్రమిస్తూనే ఉన్నాను.

ఎన్ని ఉచ్చులు వేసి నువ్వు నా ఆశలను
ఉరితీసినా
ఊపిరితిత్తుల అరల్లో ఆయువు దాచుకొని
జీవిస్తూనే వున్నాను.

పక్షాలు తుంచి నువ్వు నాలోంచి
తరిమేసిన శ్వేత కపోతం చందమామ
చుక్కలు లెక్కిస్తూ దిక్కులు చూస్తోంది నేడు
చేదుకోవడానికి అర్రులు చాస్తున్న
నా ఆవేశం చూడు.

సముద్రం నా పేరు
దరిద్రం నా వూరు
నాతో పోటీకి రాకు బ్రదర్
ప్రభంజనం హోరు నా తీరు.

క్రాంతి కేతనం

నెత్తుటి పడుపుల మీద నలుగుతున్న నాజెండా
హృదయ విదారకంగా మూలుగుతోంది
క్షతగాత్రులతో స్వరం కలిపి.

నా నరాలు దారం తీసి
నే నేసిన దుప్పటిని
నాగుండె కాసారంలో ముంచి
దేశం మీద కప్పేను.

నేను చిత్రించిన బొమ్మల్ని
కళ్లులేని గడియారం
మొండి చేతులతో స్పృశిస్తోంది జాలిగా

పాళీతో తాళం తీసి
నేను చెరవిడిపించిన గాలి
నా బొమ్మల ఊపిరితిత్తులలో విహరిస్తుంది స్వేచ్ఛగా

నా బొమ్మలే రేపటి నాదేశాన్నేలే రాజులు
న్యాయాన్ని సరితూచే తరాజులు
సామ్యవేదం గానం చేసే దినరాజులు
అమృతాన్ని పంచే రేరాజులు.

అప్పుడు...నాకలం మీద నిలబడి
నిండుగా ఎగురుతుంది ఆకాశం నిండా
నేన్నేసిన దుప్పటి జెండా.

బీజాక్షరాలు

ఆకాశంలో ఎగిరేనక్షత్రాలు
నేను కలం విదిపితే త్రుళ్ళి రాలిన అక్షరాలు.

అవి అందమైన అప్సరసలు ఆడుకొనే
ఆటవస్తువులు కాదు.
అవి?... శిరస్సులు తెగిన పర్వతాలు
మోడు వారిన వసంతాలు
రంగులు చెడిన ఇంద్రధనుస్సులు.
మిత్రుడా!

ఆ నక్షత్రాలను ఒలిచి చూడు
ఏ ఒత్తిడికి వంగని వంగడాలు శిరసెత్తి చూస్తాయి
మొలకెత్తే అదును కోసం శివమెత్తి లేస్తాయి.

నా కన్నీటితో పదును చేసిన
సుక్షేత్రాలలో వాటిని చల్లుకో
మొలకెత్తి విరాట్రూపంతో విరాజిల్లుతాయి.

ఎర్రని పూలు పూస్తాయి.
ఉక్కు గుండెల్ని రాస్తాయి
అవస్థల వ్యవస్థకు సవాలుగా నిలుస్తాయి.

నా అక్షరాలు ఎగిరే అగ్నిగోళాలు
నా అక్షరాలు రగిలే రక్త నాళాలు

క్రొన్నెత్తురు

ఎండా వెన్నెల కలసిన చోట,
నేను పారేసుకొన్నాను యవ్వనం మూట

అయినా నాది ఎప్పటికీ పాతికేళ్ల వరువం
అందుకే నాకు యింత గరువం

తూర్పు, పడమర కలసిన చోట
నేను ఆడుతున్నాను మరీచికల వేట
నాది ఎప్పటికీ తప్పని గురి
ఇంతటితో మాయాజాలం సరి

ఆకాశం, భూమి కలసిన చోట
నేను నాటాను పండ్ల తోట
దగ్గరౌతోంది అది ఫలించే రోజు
సిద్ధం చెయ్-సింహాసనం నేనే రాజు